# తెలుగు పికాసో

సుప్రసిద్ధ కథా రచయిత నీలోత్పలరావు రాసిన కథలలోని వస్తువైవిధ్యం, శిల్ప నైపుణ్యం. కళావైశిష్ట్యానికి రకరకాల సాహిత్యాభిమాన సంఘాలవారు ఉత్తరాల శరపరంపరలతో ఆయన్ని పొగుడ్తూ పొగడ్తల పొగడ దండలను వేస్తున్నారు. కొందరు పాఠకులు నేరుగా నీలోత్పలరావు ఇంటికి విచ్చేసి స్వయంగా అభినందన శత సహస్రాలను అందజేశారు.

నీలోత్పలరావుగారూ! మీ ఆధ్యాత్మిక సుధారసగాథ చదివేము. ప్రతి పదార్థానికి మూలం అంటూ ఒకటి ఉండితీరాలి గనుక ఆ మూలాన్ని భగవంతుడని పిల్చుకుంటున్నాం. ఆ భగవంతుడు సర్వాంతర్యామి, నిరాకారుడూను. అన్నింటిలోను ఆయన అంతర్గతుడై ఉన్నప్పుడు, అన్ని రూపాలూ ఆయనవే అయినప్పుడు, ఆయనది ఫలానా రూపం అని ఎలాచెప్పగలం? మన ప్రార్థనా సౌలభ్యానికి భగవంతునికి ఒక రూపం కల్పించుకున్నాం, అని మీరిచ్చిన నిర్వచనానికి జోహార్లు! నాస్తికులకి మీ నిర్వచనాలు కనువిప్పు కలిగించాలి. అని శ్రీరామభక్త హనుమాన్ సమాజం వారు హర్షం ప్రకటించి రోమహర్షణులయ్యారు.

నీలోత్పలరావు రాసిన ఒక హేతువాద కథానికను మెచ్చుకుంటూ, హేతువాద సంఘంవారి లేఖ:

నీలోత్పలరావుగారూ! మీరు రాసిన హేతువాద కథానిక ఆధ్యాత్మిక వాదులకీ, దేవుడున్నాడనే భావనగలవారికీ ఒక గొప్ప బ్రెయిన్ వాష్. ప్రతి పదార్థానికీ మూలం అంటూ ఉన్నప్పుడు,. ఆ మూలాన్ని భగవంతుడని

పిల్చుకుంటున్నప్పుడు, ఆ సోకాల్డ్ భగవంతుడికి మాత్రం మూలం ఉండొద్దా? ఆ భగవంతుణ్ణి ఎవడు సృష్టించాడు?...

మానవుడేకదా! భగవంతుడు సకల విశ్వాన్నీ సృష్టించినప్పుడు, ఆ విశ్వసృష్టికి ముందు ఆ భగంవంతుడెక్కడున్నాడో ఆ స్థలం ఈ సకల విస్వంలోని భాగం కాదా? అయితే ఆ స్థలం భగవంతుడికి ముందే ఉన్నట్టు కాదా? అనే మీ హేతువాదనకి ముగ్ధులయ్యాం. కేరీ ఆన్ విత్ యువర్ రేషనా లిజం! గుడ్ లక్.

మీ డిటెక్టివ్ డిబ్బారావు చూపిన చొరవా, చాకచక్యం, ధైర్యసాహసాలు, స్థూలదృష్టి సూక్ష్మగ్రాహత్వం వీటివల్ల ఎటూ పోలేక లొంగిపోయినస్మగ్లర్ సత్యేందర్ ఈ పాత్రలు అమోఘం! ఇటువంటి రసవత్తర సృజనాత్మక శక్తివలన, మా బోటి పాఠకులలో కూడా పరిశోధనాదృష్టి, పోలీసు సహాయం లేకుండానే స్మగ్లర్లని పట్టుకునే విధానం తెలుస్తుంది. కంగ్రాట్స్! అని డిటెక్టివ్ పాఠకులు నీలోత్పలరావుని అభినందించారు.

తరచుగా మనం సినిమాలలో చూస్తుంటాం. ఇద్దరు హీరోయిన్ల మధ్య నలిగిన హీరో. చివరికి ఎవరో ఒక హీరోయిన్ చావడం. బ్రతికివున్న హీరోయిన్‌తో హీరో ఉద్యానవనంలో డ్యూయెట్ పాడడం. లేదా ఇద్దరు హీరోల మధ్య నలిగిన ఒకే హీరోయిన్. ఒక హీరో చావడం. బ్రతికున్న హీరోతో హీరోయిన్ డ్యూయెట్ పాడడం.

నీలోత్పలరావుగారూ! మీరు వ్రాసిన కథ రెండో తరహాదే ఐనా, కథ ఒక కొత్త మలుపు తిరిగింది. ఇద్దరు హీరోలలోను ఒక్క హీరోనికూడా చంపెయ్యకుండా, హీరోలలో స్పర్థలు లేకుండా, ద్రౌపది, బహుభర్తృత్వాన్ని పాటిస్తూ పతివ్రత అయినట్లు మీ హీరోయిన్‌కూడా ఇద్దరు హీరోలనీ పెళ్లాడేసి రికార్డు సృష్టించింది. ఆ విధంగా పోలీ ఆండ్రీని ప్రోత్సహించారు మీరు. మీ యీ కథ ముగింపు సాధారణ సినిమా ప్రేక్షకులకి ఒక షాక్ ట్రీట్‌మెంట్! హేట్సాఫ్‌టు యూ అని రాశారు కొత్తదనాన్ని మెచ్చుకునే సినీప్రేక్షక సంఘం వారు.

ఆయా అభిమాన సంఘాల వారికి నీలోత్పలరావు ఉచిత రీతిని కృతజ్ఞతలు తెలుపుకుంటూ కార్డులు రాశాడు.

ఇప్పుడు నీలోత్పలరావు స్వగతంః

నేనేదో గొప్ప ఆదర్శ కథారచయిత ననుకుని, సమాజంలోని కుళ్ళును ప్రక్షాళనం చేసి సంస్కారంకోరేవాణ్ణనుకొని, పాపం అన్ని విభిన్న అభిరుచులుగల పాఠకులు, ప్రేక్షకులు, నన్ను అభినందిస్తూ ఉత్తరాలు రాస్తున్నారు. నేను చూస్తే పత్రికావసరాలకు, పాఠక ప్రేక్షకాభిరుచులకు అనుగుణంగా కథలు రాసి పారేస్తున్నాను. నాకు ఆదర్శాలంటూ ఏమీ లేవు. సంస్కారదృష్టి అంతకన్నా లేదు. సమాజంలోని కుళ్ళును అసలే కడగలేను. ఏసుప్రభువు, మహమ్మదు ప్రవక్త, బుద్ధదేవుడు, సోక్రటీసువంటి మహామహులే సమాజంలోని కల్మషాన్ని క్షాళన చేయలేకపోయారు.

ఎవరో ఒక ఇంద్రజాలికుడైనా బాబాగారు తాను ఆపాదకంఠంవరకూ ధరించిన ఇంపోర్టెడ్ సిల్కులాల్చీలో ఇరవైముప్పయి జేబులుంచుకుంటారట. కొన్ని జేబుల్లో సీకో రీకో రిస్టువాచీలు, ఎవరైనా నూతనవధూవరులు తనకు నమస్కరిస్తే ఇవ్వడానికి వీలుగా మరికొన్ని జేబుల్లో మంగళ సూత్రాలు, ఇంకొన్ని జేబుల్లో శివలింగాలు విభూతి పెట్టుకుని ఆయా సందర్భాలను బట్టి భక్త పరమాణువులకు పంచిపెడుతున్నట్టు నాక్కూడా ఒక లాల్చి ఉంది. ఆ లాల్చీలో ఇంద్రజాలికుడైన బాబా జేబులాగ నాకూ ఇరవై ముప్పయి జేబులున్నాయి. ఆయా సందర్భాలనుబట్టి ఆయా పత్రికల పాఠకుల అభిరుచులనుబట్టి ఒక్కొక్క జేబులోంచి ఒక్కొక్క తరహా కథనితీసి పత్రికలకూ తద్వారా పాఠకులకూ అందిస్తున్నాను. ఆ బాబాగారి హస్తేంద్రజాలంలోపడి అమాయకులు మోసపోతున్నట్టు నా వైవిధ్య కథేంద్రజాలంలో పడి పాఠకులూ సినీ ప్రేక్షకులూ మోసపోతున్నారు. బాబాగారు తన చేతిలోంచి ఒక మోటారు కారుతీసి ఇవ్వమంటే ఎలా ఇవ్వలేరో, అలాగే ఒక గట్టికథ పదికాలాల పాటు నిలిచే కథని రాయమంటే నేనూ రాయలేను.

విశ్వ విఖ్యాత ఫ్రెంచ్ శిల్ప చిత్రకారుడు, చిత్రశిల్పకారుడు అయిన పికాసో తన అభిమానులు తనని సన్మానించిన సందర్భంలో అన్నాడు. నా శిల్పాలలోను చిత్రాలలోను మీరనుకున్నట్లు ఆధునికత గాని అధివాస్తవికతగాని ఏమీలేవు. అవోకరకం వెర్రిమొర్రి బొమ్మలు. అవిచూసి నా శిల్పచిత్రకళాభిమానులు మోసపోతున్నారు. ఈ మాటలువిన్న పికాసో అభిమానులకు ఆగ్రహం కలిగింది. పికాసో అభిప్రాయంతో వాళ్ళు ఏకీభవించలేదు, సరికదా ఖండించారు!

అలాగే, నేనిప్పుడు నా కథల్లో పసలేదు, పట్టి వ్యాపార దృక్పథంతో రాసిన కథలు అనంటే నా అభిమాన పాఠక మహాశయులు ఒప్పుకోరు కనుక ఇలాకాలం వెళ్ళబుచ్చుతూ ఉండవలసిందే. నేనొక కార్ఖానాని! అందరి అభిరుచులకూ అనుగుణంగా కథల్ని ఉత్పత్తి చేస్తూనే ఉంటాను.

• మయూరి వీక్లీ •

*10–1–1986*